చల్లని వెన్నెల సందిటిలో సేదదీరిన ప్రకృతిని తట్టి లేపుతున్నాయి ప్రభాత కిరణాలు.

బొయ్యిమని రొదజేసుకుంటూ వచ్చి ఆగింది బస్సు. సూట్‌కేస్ పుచ్చుకుని బస్సు దిగింది ప్రేమలత. దుమ్ము లేపుకుంటూ ముందుకు సాగారింది బస్సు. తన చిన్నతనంలో యీ బస్సురూటు పడినప్పటినుండి పదిహేను సంవత్సరాల క్రితం చివరిసారి తనీవూరికి వచ్చినప్పటికీ, యిప్పటికి వ్యత్యాసాన్ని గమనిస్తూంది ప్రేమ.

# నరజాతిచరిత్రసమస్తం...

## డా॥ ఆటూరి విజయలక్ష్మి

"ఎవరింటికండి?" నలువైపులా చూస్తూనుంచున్న ప్రేమను ఆమెతోపాటు బస్సుదిగిన వారిలో ఒకతను అడిగాడు.

"బలరామయ్యగారింటికి" తెప్పరిల్లి జవాబిచ్చింది ప్రేమ. 'అలాగా!' అన్నట్లు చూచి ఆ మాత్రం ఆసక్తి కూడా కనబరచని మిగతా యిద్దరితో కలిసి ఊరివైపు వెళ్ళిపోయాడు. వారివంక ఆశ్చర్యంగా చూచింది ప్రేమ. ఊళ్ళోకి వచ్చినవారి పుట్టుపూర్వోత్తరాలు, వారెవరింటికి వెళ్ళేదీ, ఎన్ని రోజులుండేదీ, ఏ పనిమీద వచ్చిందీ కూలంకషంగా తెలుసుకుని గాని వదలరు తనకు తెలిసిన తన ఊరివారు.

ఊరిని, బస్ సెంటర్‌ని కలుపుతున్న మూడు ఫర్లాంగుల మట్టి రోడ్డు కంకర రోడ్డుగా మారింది గాని అంతా గోతులమయంగా వుండడంవల్ల జాగ్రత్తగా చూచుకుని నడుస్తూ పరిసరాల్ని గమనిస్తూంది ప్రేమ. రోడ్డు కిరువైపులా వున్న పొలాలు తనకు తెలిసినప్పటి కంటే చిన్నచిన్న మడులుగా ఒక వరుసా క్రమం లేకుండా వున్నాయి. కళ్ళాల్లో చిన్న చిన్న వరికుప్పలు వున్నాయి. వాటిని చూస్తూంటే ఆజానుబాహుడైన తన తండ్రి, బంగారం పండే తమ పొలం, తను ప్రాకులు పాపాయిగా వున్నప్పుడు మాసూళ్ళ రోజుల్లో సరదాగా తండ్రికి పొలానికి భోజనం తీసుకెళ్ళడం, గడ్డి పానుపు మీద గొంగడి క్రింద తండ్రి ప్రక్కలో వెచ్చగా దూరి పడుకుని ఆయన కురుక్షేత్రం, హరిశ్చంద్ర, కాళిదాసు మొదలైన నాటకాల్లోని పద్యాల్ని గొంతెత్తి శ్రావ్యంగా పాడుతూంటే తను మైమరచి వినడం... అన్నీ ఒక మధుర స్వప్నంలా కళ్ళముందు నిలిచాయి.

రోడ్డుకు కుడివైపున ఒక టూరింగ్ సినిమా టాకీస్ వచ్చింది. ఎడమ వైపున వున్న హరిజనవాడలో ఇళ్ళు పెరిగాయి. కరెంటు తీగలు కూడా విస్తరించాయి. ఊళ్ళోని రాజకీయ కాలుష్యంవల్ల చుట్టుప్రక్కల ఊళ్ళ కంటే పెద్ద ఊరయినప్పటికీ ఆ ఊళ్ళల్లో కరెంట్ వచ్చిన చాలా సంవత్సరాలకుగాని ఈ ఊరికి కరెంట్ రాలేదు.

"ఎవరమ్మా తమరు?" ఊరి మొదట్లో వున్న హరిజనుల చెరువు గట్టు మీద నుంచుని కళ్ళు చిట్లించుకుని చూస్తూ ప్రేమను ఆనవాలు పట్టడానికి ప్రయత్నిస్తున్నాడో వృద్ధుడు. ఆగి అతని వంక పరిశీలనగా చూచింది ప్రేమ.

"ఏసోబూ! బావున్నావా?" ఏసోబును గుర్తించిన ప్రేమ అతన్ని పలకరించింది. తన చిన్నతనంలో తమ యింట పెద్ద పాలేరుగా పనిచేసిన ఏసోబు నాయనమ్మ తనను ముట్టుకోవద్దని తిడుతున్నా వినకుండా తనను భుజాల మీద ఎక్కించుకుని ఆడించేవాడు. తన తండ్రికి నమ్మిన బంటితను.

"నేను ఏసోబూ! పాపను. భద్రయ్యగారి సీతారామయ్య గారమ్మాయిని. గుర్తుపట్టలేదు కదూ నన్ను?" ఆనందంగా, ఆప్యాయంగా అతని వంక చూచింది ప్రేమ.

"మా అమ్మే. తమరా?! బావున్నావా అమ్మా?! అల్లుడుగారు రాలేదా?... మా దొరగారెళ్ళిపోయారంటగదా?!" సంతోషంతో పొంగిపోతూ కుశలమడుగుతున్న అతని కంఠం చివరలో రుద్ధమయింది. తండ్రి ప్రసక్తి రాగానే, అందునా అతనంత ఆప్యాయంగా అడగగానే దుఃఖ కెరటం పుష్ప గుండెను తడిపింది.

"ఆ మారాజును చూచి పదేళ్ళయింది. తమరు ఢిల్లీ తీసుకెళ్ళిపోయాక ఒక్కసారే వచ్చారు. దొరగారిక్కడున్నన్ని రోజులూ ఆరి మంచం దగ్గరే పడుకుని ఊరి ఊసులన్నీ చెప్పాను- అదే కడసారి చూపయింది నాకు... అట్లాంటి మారాజెక్కడున్నాడమ్మా ఊళ్ళో?! ఆయనున్నన్నాళ్ళు మాబోటి బీదాబిక్కీని ఒక కంట చూచేవారు. ఆయన చలవతోనే నేనా చారెడు చెక్కా కొనుక్కోగలిగాను... ఆయనే వుంటే ఊరిలా తగలడిపోయేదా? ఎప్పుడన్నా తగూలు రాజుకున్నా ఎట్లా చెప్పాల్సినాళ్ళ కట్లా చెప్పి చల్లబడేలా చేసేవారు" ప్రేమతో పాటు ఊళ్ళోకి నడుస్తూ చెప్పసాగాడు ఏసోబు.

"ఒక తల్లి కడుపున పుట్టినాళ్ళే అయినా మీ పెదనాన్నగారికీ మా దొరగారికీ ఎంత తేడా?! ఊరాళ్ళకు ఏ మేలు చేద్దామా అని చూచేవారు మా దొరగారు. ఊరాళ్ళ ముదనష్టాలన్నీ కలుపుకున్నా కుతి తీరదు మీ పెదనాన్నగారికి. ఎప్పుడూ ఎవరినెత్తిన చెయ్యిపెట్టి ఇవప్పెట్టి నింపుకుందామా అన్న యావే ఆయనకి" చిన్నగా చెప్పుకు పోసాగాడు ఏసోబు. హైస్కూల్లో ప్రేమ క్లాస్‌మేట్ చలపతి గొడ్లను తోలుకొస్తూ ప్రేమను చూచి దగ్గరకు వచ్చి పలకరించి వాళ్ళతోపాటు నడవసాగాడు.

" మీ అబ్బాయిలేం చేస్తున్నారు ఏసోబూ?" కొడుకుల పేరెత్తగానే కళ్ళనీళ్ళు తిరిగాయి ఏసోబుకి.

"ఆళ్ళ ఊసెత్తొద్దు తల్లీ! నా గుండె చెరువవుద్ది. ఊరిపెద్దలు నా రెండో కొడుకుని పొట్టన పెట్టుకున్నారు. పిల్లా పాపల్తో వున్నాడిని యీ కసాయాళ్ళు నిలువునా ఖూనీ చేసి పారేసారు." వైపంచతో కళ్ళు తుడుచుకుంటూ దుఃఖాన్ని నిగ్రహించుకుంటానికి ప్రయత్నించాడు ఏసోబు.

"పెద్దతని మీద లేనిపోని నేరాలు మోపి జెయిల్లో తోయించారు. యింతకూ వాళ్ళు చేసిన అపరాధ మేమిటో తెలుసా ప్రేమా?... మేము మీ మోచేతి క్రింద నీళ్ళేం తాగడం లేదు. కష్టపడి చెమటోడ్చి మా బ్రతుకులు మేం బ్రతుకుతున్నాం. మీ దాష్టీకాన్ని, దౌర్జన్యాన్ని మేమెందుకు సహించాలి?" అని అడగడం, వాళ్ళ అధికారానికి లొంగి బ్రతక్కపోవడం" చలపతి చెప్పాడు.

"మా రోజులు వేరమ్మా! మేమూ అందరి లాంటి మనుషులమే. బానిస బ్రతుకు బ్రతకాల్సిన పనిలేదన్న జ్ఞానమూ మాకు తక్కువ. మా యజమానులూ మమ్మల్నింత హీనంగా కర్కోటకంగా చూచేవారు కాదు" ఏసోబు చెప్పదలచుకుందేమిటో అర్థమయింది ప్రేమకు. అగ్రవర్ణాలకు, దళితులకు మధ్య రాజు కుంటున్న సంఘర్షణలను, సహజీవనం సాగించాల్సిన వివిధ వర్గాల మధ్య ఉత్పన్నమవుతున్న కల్లోలాన్ని మీనాక్షిపురం, కారంచేడు- దేశంలో ఎక్కడో ఒక చోట తరచూ జరుగుతున్న సంఘటనలు ప్రతిబింబిస్తూనే వున్నాయి. 'మేమూ మనుషులమే' అన్న చైతన్యం, అందరు మనుషులూ సమానమే' అన్న స్పృహ మనిషికీ, మనిషికీ మధ్య సదవగాహనను, మైత్రినీ పెంచాల్సింది పోయి మరింత దూరాన్ని, కక్షల్ని, కావేషాన్ని పెంచు తూంది. యీ అలజడికీ, అరాచకాలకు గల ఆర్థిక, సాంఘిక, రాజకీయ కారణాల్ని పరిశీలించి పరిష్కారాన్ని వెతక్కుండా వాటిని తమ స్వార్థానికి ఉపయోగించు కుంటున్న రాజకీయ పార్టీల్ని ప్రజలు గమనిస్తూనే వున్నారు ... ప్రేమ తమ చాకలి కొడుకు ఎదురుపడి పలకరించడంతో ఆలోచనల్నుండి బయటపడింది. చాకలి, చలపతి ప్రేమతో చెప్పి వెళ్ళిపోయారు.


"మీ అబ్బాయిని విడిపించడానికి ప్రయత్నించలేదా ఏసోబూ?"

"ఎందుకు ప్రయత్నించలేదమ్మా? కాని... ఈ కోర్టులు, ప్లీడర్లూ మాలాంటి పేదోళ్ళకేమాత్రం న్యాయం చేస్తాయో తమరికి తెలుసుకదమ్మా! వాళ్ళతో పాటు డబ్బు వెదజల్లి న్యాయాన్ని కొనుక్కోగల తాహ తెక్కడున్నదమ్మా మాకు?" అతని మాటలు వింటూంటే ఆశ్చర్యంగా వుంది ప్రేమకు. అమాయ కంగా, ఏమీ తెలియనట్లు వుండే ఏసోబు నోటివెంట వెలువడుతున్న మాటల్ని విని పరిస్థితులే అన్నీ తెలియ జేస్తాయనిపించింది.

"అమ్మా! మరి నేవెళ్తాను. నాలుగు రోజులుంటా సుగా తమరు?!" ప్రేమ పెదనాన్నగారిల్లు దగ్గర పడ డంతో ఆగాడు ఏసోబు.

"వుండాల్సొస్తుందేమో! పెదనాన్న చూస్తున్న మా పొలాన్ని అమ్మేసి వెళ్దామనొచ్చాను. దాని మీదొచ్చే ఆయివేజేమీ పంపడం లేదాయన. దాన్ని అమ్మి పడేస్తే యింక ఆయనతో గొడవుండదని అమ్మ ఒకటే గొడవ చేస్తూంది. అమ్మేయమని పెదనాన్నకు ఎన్నిసార్లు ఉత్తరాలు వ్రాసిన ఎవరూ కొనడానికి ముందుకు రావడం లేదని వ్రాస్తున్నారు."

"ఎట్లా వస్తారమ్మా, ఈయనగారు రానిస్తేగా?! ఎట్లాగన్నా నువ్వు వినుగుపుట్టే అలవలు మలవలకు పారేస్తే కాజేద్దామని గుంటకాడి నక్కలా,- కాచుకు కూర్చున్నాడు... ఈడిట్లా మాట్లాడతన్నడేమిటా అని అనుకుంటున్నావామ్మా?! ...యీయన కుటుంబం నాకు పెట్టిన కడుపుకోత నాతో యిట్లా మాట్లాడి స్తొందమ్మా!" కసి, కోపం, పగ, దుఃఖం మిళిత మయాయతని స్వరంలో.



"ఏమ్మా! యిదేనా రావడం? డాక్టరుగార్ని కూడా తీసుకు రాకపోయావా?" ప్రేమ పెదనాన్న కొడుకు రామారావు గేట్లోంచి బయటకి వస్తూ ప్రేమను పలకరించి, ఆమె ప్రక్కనుంచున్న ఏసోబుని చూసి ముఖం చిట్లించి కాండ్రించి" ఉమ్మేసాడు.

"వెళ్తానమ్మా!" రామారావు వంక కొరకొర చూసి 'థూ' అంటూ ఊసి కర్ర తాటించుకుంటూ వెనక్కు తిరిగాడు ఏసోబు. రామారావు బూతులు మొదలు పెట్టి ఏసోబు మీద మీదకు వెళ్ళిన వాడల్లా ప్రేమ వారించ డంతో ఆగాడు.

"ఎంత కండకావరం బలిసిందనుకున్నావీ మాల లం... కొడుకులకి?! కళ్ళు నెత్తికెక్కి ఛస్తున్నారు. పెద్దా చిన్న, ఉచ్చం నీచం లేకుండా వుందీళ్ళకు" ఆవేశంతో రొప్పుతూ బూతులు మొదలు పెట్టాడు మళ్ళీ.

"ఇంట్లోకి వెళ్దాం పదన్నయ్యా!" పదిమందీ చేరడం చూసి సిగ్గుతో చితికి పోతూ చిన్నగా అంది ప్రేమ. పొలాన్ని అమ్మడమనే నెపంతో తను పుట్టి పెరిగిన ఊరిని ఎన్నో ఏళ్ళ తరువాత కళ్ళారా చూడాలని ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా వచ్చిన ప్రేమ ఊళ్ళో అడుగు పెట్టీ పెట్టగానే అయిన చేదు అనుభవంతో దుఃఖితురాలయింది.

"ఎవరూ! పాప! ఎంతకాలానికి గుర్తుకొచ్చామమ్మా నీకు? పిల్లల్ని, మా తమ్ముడిగారిని తీసుకు రాలే దేంటి?" నిష్ఠూరమాడుతూనే నవ్వుతూ ప్రేమను

ఆహ్వానించింది రామారావు భార్య సావిత్రి.

"బావున్నావా వదినా?" నీళ్ళతొట్టి దగ్గర కాళ్ళు కడుక్కుంటూ అడిగింది ప్రేమ.

"ఆ! ఏం బాగులేమ్మా, బండలు బాగు! మీ అన్నయ్య, మేనల్లుడు నన్ను బాగా బ్రతకనిస్తారా? రోజూ ఏదో ఒక కుంపటి తెచ్చి నా గుండెల మీద పెట్టందే ఊళ్ళకు నిద్రపట్టదు" విచారంగా అంటున్న సావిత్రి ముఖం కొండంత భారాన్ని మోస్తున్నదానిలా వుంది.

"చాల్లే నీ సోది ఆపింక. పాపకు కాఫీ పెట్టేస్తావా లేదా? నీ మర్యాద తగలడినట్లే వుంది" మాటలకంటే పరుషంగా వున్న ఆ కంఠాన్ని వినడానికి కంపరంగా వుంది ప్రేమకు.

భర్త ధోరణిని సంవత్సరాల తరబడి భరిస్తున్నా రాకరాక వచ్చిన ఆడబడుచు ముందు అంత చులకనగా మాట్లాడడాన్ని సహించలేక ఎదురుతిరిగి అనబోయి, మరింత బండమాటలతో అవమానింపబడడం యిష్టం లేక ముడుచుకుని వంటింట్లోకి వెళ్ళింది సావిత్రి.

"పెద్దమ్మ, పెదనాన్న ఎక్కడన్నయ్యా?" ఇంట్లోకి వెళ్తూ అడిగింది ప్రేమ.

"ఇటు దొడ్లో, సావిట్లో గది కట్టాము. దొడ్లో వున్నారు" ప్రేమ చూపుల్ని తప్పించుకుంటూ చెప్పాడు రామారావు.

"అదేంటన్నయ్యా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రేమ.

ముసలాయనకు పక్షవాతం వచ్చింది. అన్నీ మంచం లోనే. ఇల్లంతా ఛండాలంగా తయారవుతుందని..." చివ్వున వెనక్కు తిరిగి దొడ్లోకి వెళ్ళింది ప్రేమ.

"యిలా జరిగిందని మాకు ఎవరూ ఉత్తరమన్నా వ్రాయలేదేం పెదనాన్నా?" బలరామయ్య మంచం పట్టె మీద కూర్చుని అతని వంక విహ్వలంగా చూసింది ప్రేమ. అతనెంత పాషండుడో, ఒక్కగానొక్క తమ్ముడైన తన తండ్రి పట్ల అతనెంత కుసంస్కారంతో, అమాయతో ప్రవర్తించేవాడో, తన బిడ్డలకు చదువబ్బకపోగా తమ్ముడి బిడ్డలు ఫస్ట్‌రాంక్స్‌తో పెద్ద చదువులెందుకు చదువుకోవాలనే ఏడుపుతో తన చదువుకు, అన్నయ్య చదువుకు ఎన్ని అడ్డుపుల్లలు వేసేవాడో, ఊళ్ళో అందరి నెత్తినా చెయ్యి పెట్టి సంపాదించినట్లే తమ నెత్తినా అలాగే పెట్టడానికెలా ప్రయత్నించేవాడో... ఆ క్షణంలో అవేవీ గుర్తుకు రాలేదామెకు. తన తండ్రి తోడబుట్టినవాడలా అందరూ వుండీ దిక్కు లేనివాడిలా గొడ్ల దొడ్లో నిస్సహాయంగా మంచాన పడుండడం ఆమెను నొప్పించింది.


"అల్లుడుగారొస్తే మీ పెదనాన్నను చూచి మందిచ్చేవారు. ఆయన మందిస్తే యీపాటికి కాలు, చెయ్యీ వచ్చేదేమో!" క్రుంగిపోయి దీనంగా కూర్చున్న ప్రేమ పెద్దమ్మ అంది.

"ఆయనెక్కడకూ కదలడానికి వీలవదు పెద్దమ్మా!" కాసేపు పెద్దమ్మతో కబుర్లు చెప్పి, పెదనాన్నను ఓదార్చి ఇంట్లోకి వచ్చిన ప్రేమకు ఒక చక్కటి అమ్మాయి కనపడింది.

"పెద్ద కోడలు ఇందిర" సావిత్రి చెప్పింది.

"శ్రీను ఎలా పోయాడు వదినా?"

"అయినదానికి, కాని దానికి తిట్టు, చచ్చేలా కొట్టడమే తప్ప పిల్లల్ని సరైన దారిలో పెట్టేలా మీ అన్నయ్య పెంచారా?! ఈ ఇంట్లో నా మాటకు చిల్లి గవ్వంతకూడా విలువలేదు. ప్రతిదానికి ఆడదానికి నీకేం తెలుసని నా నోరు మూయ్యడమే... చేతినిండా డబ్బు, వయసులో వున్న పిల్లాడికి యింక చెడు సావాసాలకు కొదవేమిటి? అన్ని వ్యసనాలూ అబ్బాయి. ఫూటుగా తాగేసి మోటర్ సైకిల్ మీద వస్తూ బండికి గుద్దించేసి అక్కడికక్కడే పోయాడు" యథాలాపంగా చెప్పినట్లు చెప్పబోయిన సావిత్రి బాధ సుళ్ళు తిరిగి, గుండె చెరువై ఒక్కసారి కొడుకును తలచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. మౌనంగా, ఓదార్పుగా వదిన భుజం మీద చెయ్యేసింది ప్రేమ.



"ఏమిటో బిడ్డల్ని కనగలమేగాని వాళ్ళ రాతల్ని కనగలమా! రెండోవాడు తనవాటా పంచుకుని అమ్మేసి వెళ్ళిపోయి బెజవాడలో మకాం పెట్టాడు. యింక చిన్నాడు రఘుకెంతసేపూ ఊళ్ళో పార్టీలు, దెబ్బలాటలు, అమ్మాయి కాపరమూ అంతంత మాత్రమే. ఎంత దోచిపెట్టినా యింకా తెమ్మనే దాని అత్తారి సాధింపు" సావిత్రి వెంగుతో కళ్ళు తుడుచుకుంటూ కష్టసుఖాలు చెప్పుకుపోతూంది.

"ఎక్కడికమ్మా, గుడికి వెళ్తున్నావా?" ఇందిర చేతిలో పూలు, కొబ్బరి కాయ చూచి అడిగింది ప్రేమ. ప్రేమవంక నిర్లిప్తంగా చూచి అవునన్నట్లుగా తలూపింది ఇందిర.

"ఒక్క నిమిషం. నేనూ వస్తాను నీతో"

ఇందిరతో కలిసి ప్రేమ గుడికి వెళ్ళింది. గుడి శిథిలావస్థలో వుంది. గుడి ఆవరణలో ఇదివరకుండే ప్రశాంతత, పవిత్ర వాతావరణానికి మారుగా నిర్జీవత, నిస్తబ్దత వ్యాపించివుంది.

"పిన్నిగారూ! బాబాయిగారు గొప్ప హార్ట్ సర్జన్ అంటకదా!" అప్పటి వరకు నిశ్శబ్దంగా ప్రేమ చెప్తున్న కబుర్లు వింటున్న ఇందిర పొన్న చెట్టు దగ్గర చిన్నప్పటిలా పువ్వులేరుతున్న ప్రేమ ప్రక్కన కూర్చుని తనూ పువ్వులేరుతూ అడిగింది. ప్రేమ మాటలు వింటున్న కొద్ది గాంభీర్యం చాటున దాగున్న ఇందిర సహజ ప్రకృతి రెక్క విప్పుకుంటూంది. ప్రేమ ఇందిరవంక చూచి చిన్నగా నవ్వి ఊరుకుంది.

"మీరు మా పెళ్ళికి కూడా రాలేదు."

మీ బాబాయిగారికి తన వృత్తే లోకం. నాకూ లీవ్ దొరకడం కష్టం. అమ్మా, నాన్నగారూ ఇద్దరూ అనారోగ్యంగా వుండడంవల్ల వాళ్ళని ఇంట్లో వదిలి రావడానికీ వీలయేది కాదు. శుభకార్యాలకు రాలేకపోయినా కనీసం శ్రీను పోయాడని తెలిసినప్పుడు వద్దామనుకున్నాను. అప్పుడూ ఏదో అవాంతరం వచ్చి ఆగిపోవాల్సి వచ్చింది" భర్త మరణం ప్రసక్తి వచ్చేసరికి తన జీవితం కళ్ళెదుట కనిపించి ఇందిర మళ్ళీ కృత్రిమ గాంభీర్యపు తెరను దించేసుకుంది. లేచి గుడి వైపు అడుగులు వేస్తున్న ఇందిరను అనుసరించింది ప్రేమ.

గుళ్ళో పూజారి క్రొత్తవాడు. వినగానే భక్తిభావంతో మనసు నిండిపోయే ఆచారిగారి మంత్రోచ్చారణ గుర్తుకొచ్చింది ప్రేమకు. యీ పూజారికి మంత్రోచ్చారణ మీదగాని, పూజా విధానం మీద గాని మమకారం, శ్రద్ధవున్నట్లు లేదు. అతని కళ్ళు ఎంతసేపూ పళ్ళెంలో పడిన కానుకల మీదే వున్నాయి. భక్తుల్లోనూ యాంత్రికతే కనిపిస్తూంది తప్ప తాదాత్మ్యత లేదు. ప్రసాదం పుచ్చుకుని మండపంలో ఒక నిముషం కూర్చుందామని అటువెళ్ళిన ప్రేమ అక్కడ కుర్రాళ్ళు, కొంతమంది పెద్దాళ్లు కూడా పేకాడుతూ వుండడం చూచి విస్తుపోయింది.

"యిక్కడ పేకాడుతూంటే వీళ్ళనెవరూ ఏమీ అనరా?"

"వాళ్ళని అనగల గుండెలెవరికున్నాయి? ఒక్కో రౌడీ మూక. డబ్బున్న పొగరు కొంతమందిది. దౌర్జన్యం, రౌడీతనం బలం కొందరిది. తాతముత్తాతలు సంపాదిం

## డెజావూ

చైతన్యం అంటే
స్పృశించటంకాదు దేహాన్ని
కాలాన్నీ దేశాన్నీ స్పృహించటం
నాదొక సిల్లీ మిల్లీమీటర్ లాంగర్
అంటే కాండీ అన్నది తనదింకా లోతర్ అని
కాలాన్నీ దేహాన్నీ స్పృహించింది
దొడ్లో ఏవీ తినవాకు
ఇట్ టేస్ట్స్ లైక్ షిట్
గగన కన్య కాంతీ సౌమిత్రికీ తెలుసు
నేనిపుడు విశాఖాఘాతాల్లోకి రాల్తూన్న రైలునని
ఈ భూగోళార్ధ భాగాన
చెరపిన నున్నుదుట కుంకుమనని
కానీ నేనపుడెపుడో యాపిల్స్
సూర్య స్నాత ఆల్ప్స్ పర్వతాల
షివాస్‌రీగల్ వక్షోజ షాంపియుడ్ని
యూరినల్స్‌లో నేను హిందూగాలిని విడవను
విద్యుదాఘాతాల విమాన యానాల
వాషింగ్టన్ ఏడో వీధి మొగన
నిలిచిన మొగలి పూల మిన్నాగుని
కత్తితో కాచిన నీగ్రో ఎఱ్ఱబాకుని
మరియు వానా పొగ పీల్పించిన ఎరిక్ క్రజ్‌నీ
చైనీస్ డ్రాగన్ బ్లూఫిలిమ్ హాల్లో కిల్లీ ఫాతిమా బేగమ్‌నీ
స్పృశిస్తాను స్పృహిస్తాను నయాగరా ముందు ఒంటేలుకు
పోసుకుని

—'మో'

చిందాన్ని రెండు చేతులా ఖర్చు పెట్టేస్తూ సోమరుల్లా బతికేయడమే వీళ్ళ హాబీ" · దౌర్జన్యం, రౌడీతనం దుష్పరిణామాల్ని, అరాచకత్వాన్ని నగర జీవితంలో మరింతగా అనుభవిస్తూ వుండడంవల్ల వాటి బలమెంతో తేలిగ్గానే అంచనా వేయగలిగింది ప్రేమ. గుడికి తాళం వేసి పూజారి వెళ్ళిపోయాడు. గుడిమెట్ల మీద కూర్చుని కొబ్బరి చెక్కను కొట్టి ప్రేమకు ముక్కల్ని పెట్టింది ఇందిర. ఇందిర తనకేదో చెప్పాలని తటపటాయిస్తున్నట్లుగా గమనించింది ప్రేమ.

నువ్వేం చదువుకున్నావమ్మా?" ప్రేమ ప్రశ్నలో ఇందిర సంకోచాన్ని వదిలించుకుంది. ఇంటర్ ఫస్టియర్‌లో వుండగా పెళ్ళయింది. నాకు బాగా చదువుకోవాలని ఎంతో కోరిక. నేనప్పుడే పెళ్ళి చేసుకోనని, చదువుకుంటానని ఎంత పట్టు పట్టినా వినకుండా డబ్బున్న వాళ్ళ సంబంధమని మానాన్నగారు పెళ్ళి చేసేసారు... పెళ్ళికి ముందే ఈయనకు సర్వ వ్యసనాలూ వున్నాయని మాకు తెలిసింది. పెళ్ళయితే అతనే దార్లో పడతాడంటూ ఆయన మా అభ్యంతరాలన్నిటినీ కొట్టిపారేసారు. నా పెళ్ళి విషయంలో నా యిష్టాయిష్టాల్ని ఆయన లెఖ్ఖచెయ్యలేదు సరికదా అవతలి మనిషి గుణగణాలకంటే వాళ్ళ ఆస్తిపాస్తులకు ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చారు... పెళ్ళికీ, సంసారానికీ ఏ మాత్రం సన్నద్ధంగా లేని నేను ఊపిరాడక ఉక్కిరి బిక్కిరవుతూ వుండగానే ఇద్దరు పిల్లలు పుట్టేసారు. నేను గుక్క తిప్పుకుని యీ బతుకు తప్పని సరయి నప్పుడు రాజీపడి దీనిలోనే సుఖమూ, సంతోషమూ వెదుక్కోవాలని అనుకునే సమయంలో ఈయన పోయారు. ఈయన పోయేముందే అమ్మ, నాన్నగారు ఒక్కసారే ఏక్సిడెంట్‌లో పోయారు. వున్న అక్కకు అన్నయ్యకు నన్ను, నా బిడ్డల్ని భరించి కడతేర్చే శ్రద్ధా, పెద్ద మనసు లేవు... ఇరవై ఏళ్ళయినా నిండని నేను కాస్తంత ప్రేమ, దయ లేని ఈ మనుషుల మధ్య యీ పసికందులిద్దర్నీ ఎలా పెంచను? ...ఎప్పటికి, ఎన్నేళ్ళకు తరుగుతుందీ బతుకు!" భోరుమని ఏడ్చింది ఇందిర. ఆమెను పొదివి పట్టుకుని ఓదార్చడానికి ప్రయత్నించింది ప్రేమ.

"ఇదివరకు శతాబ్దాలు గడిస్తే గాని మారని మానవ జాతి చరిత్ర ఇప్పుడు దశాబ్దాల్లో, సంవత్సరాల్లో శర వేగంతో మారిపోతూందంటున్నారు. ఇరవై ఒకటో శతాబ్దంలోకి అడుగు పెట్టడానికి సర్వహంగులతో సన్నద్ధమవాలని కలలు కంటున్నారు... కాని నాలాంటి ఆడపిల్లల అసహాయ జీవితాల్లో ఇప్పటికీ నత్తనడకతోనే వస్తూంది మార్పు. సాంప్రదాయపు బంధనాల్ని తెంచుకుని స్వేచ్ఛగా, సంతోషంగా బతకాలని కలలుకంటున్న ఆడపిల్లల కలలు కల్లలే అవుతున్నాయి." స్వప్నంలో వున్నదానిలా ఇందిర మాట్లాడుతూంటే ప్రేమ మౌనంగా వింటూంది.

"సాంప్రదాయాల్లోని మంచిని పాటించని ఈ




మనుషులు సాంప్రదాయపు అవలక్షణాల్ని మాత్రం పట్టుకుని వేళ్ళాడుతూ తమ బతుకుల్ని తాము నిర్ణయించుకునే అధికారాన్ని, తమ జీవితాల్ని తాము నడుపుకునే స్వతంత్రాన్ని ఆడపిల్లల కుండనివ్వడంలేదు. ...ఇది దారుణం కాదూ?" అమాయకంగా, విషాదంతో నిండివుండే కళ్ళు జ్వలిస్తున్నాయి. ఎన్నాళ్ళ నుండో ఆమె హృదయంలో పేరుకు పోయిన వేదన, తన బతుకును అర్ధవంతం చేసుకోవాలన్న తపన ఇన్నాళ్ళకు ధైర్యంగా బయటపడుతున్నాయి.

"రెక్కలు విప్పుకుని ఆ రెక్కల మీద నా పిల్లల్నిద్దర్నీ కూర్చో పెట్టుకుని ఈ బందిఖానా నుండి ఎగిరి పోయి హాయిగా బతకాలని నేను కలలు కంటున్నాను. యింకా కొన్నాళ్ళిక్కడే వుంటే నా రెక్కల్ని విరిచేసి నన్నిక్కడ శాశ్వతంగా బంధించేస్తారేమోనని ప్రతిక్షణం ఒణికి పోతున్నాను. డబ్బు, స్వార్థం, అహంకారం, దౌర్జన్యం తప్ప ప్రేమ, మమకారంలేని ఈ రాక్షసుల మధ్య ఊపిరాడక గింజుకుంటున్నాను. ...నా ఆస్తిని, నా పిల్లలకు చెందవలసిన వాటాను తన గుప్పెట్లో పెట్టుకుని తన అధికారం క్రింద నేను జీవితాంతం మగ్గిపోవాలని మా మామగారి కోరిక. అత్తగారు నోరులేని మనిషి. నాకు అపకారం జరిగినా వారించ గల శక్తి లేనిది. బయట తిరుగుళ్ళు చాలక, వదినగారినన్న పవిత్ర భావం లేకుండా నన్నెప్పుడు కబళిద్దామా అని తోడేల్లా కాచుకు కూర్చున్నాడు చిన్న మరిది." కసితో, కోపంతో నిండాయామెకళ్ళు.

"ఆ విధమైన మురికి బతుకు బతకడం కంటే చావడం మేలు... కాని నాకు చావాలని లేదు. బతకాలని వుంది; సంతోషంగా బతకాలని వుంది పిన్నిగారూ!...మీ గురించి వీళ్ళంతా చెప్పుకుంటూంటే విన్నాను. నాకు కావలసిన ధైర్యాన్ని, మోరల్ సపోర్ట్‌ని మీరివ్వగలరన్న ఆశతో మీకు చెప్పుకుంటున్నాను" ప్రేమ చేతుల్ని తన రెండు చేతుల్తో అందుకుంది ఇందిర. ఆమె కన్నీళ్ళతో ప్రేమ చేతులు తడుస్తు

న్నాయి. ఆ దయనీయతకు కదిలిపోయింది ప్రేమ. ఇందిర విషయంలో కల్పించుకుంటే అనవసరపు చిక్కుల్లో పడతానేమోననే గుంజాటనలో వున్న ప్రేమ ఒక స్థిర నిశ్చయానికొచ్చింది. ఇందిరకు కావలసింది సానుభూతి, కంటి తుడుపు మాటలు కాదు. నిజమైన చేయూత, 'నీ ప్రక్కన నేనున్నాను. భయం లేదు. ధైర్యంగా పోరాడు' అన్న ప్రోత్సాహం.

"నేను అన్నయ్యతో మాట్లాడుతానమ్మా! నువ్వు హాస్టల్‌లో వుండి చదువుకునే ఏర్పాటు చేస్తాను. మాటలతో వినకపోతే పోట్లాటకు కూడా సిద్ధపడే నీకీ అభయమిస్తున్నాను" ఇందిర సంతోషంతో పొంగిపోతూ ప్రేమ చేతుల్ని కళ్ళ దగ్గరుంచుకుంది.

అంతలో మండపంలో వున్న పేకాట రాయుళ్ళంతా పెద్దగా కేకలు వేసుకుంటూ, జారిపోతున్న లుంగీల్ని ఎగదోపుకుంటూ పొలాల వైపు పరుగులు తీసారు. ఊళ్ళోనుండి కూడా గోలగోలగా అరుచుకుంటూ మగాళ్ళు పొలాలవైపు వెళ్తున్నారు.

"ఏం జరిగిందో, వీళ్ళిలా పరుగెత్తుతున్నారు!"

"ఏముంది?! మళ్ళీ ఏదో కొట్లాట జరిగుం టుంది" లేస్తూ అంది ఇందిర.

తమ పొలం విషయం గురించి, ఇందిర విషయం గురించి రామారావుతో మాట్లాడడానికి ప్రేమ ప్రయత్నించింది కాని అతను ఒంటరిగా దొరకలేదు. ఎవరెవరో రావడం, గుసగుసలు పోవడం, మిద్దెమీద నుండి తాతలనాటి బరిసెలు, కత్తులు క్రిందికి దింపి రహస్యంగా ఎక్కడికో పట్టుకెళ్ళడం చూచి సావిత్రి హడలిపోతూ భర్తను అడగబోయేసరికి అతను కళ్ళెర్రజేసి 'నోర్మూసుకుని అవతలికి చావు. ఆడదానికి నీకెందుకే ఆరాలు?' అని అరిచి బయటకు వెళ్ళి పోయాడు.

ప్రొద్దు పోయినా యింకా భర్త, కొడుకు యింటికి రాకపోయేసరికి కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి, బయటికి తిరుగుతూ కొడుకు కోసం ఎదురు తెన్నులు చూస్తూంది సావిత్రి. ఇందిర బిక్కచచ్చిపోతూ పిల్లల్ని నిద్రపుచ్చి వాళ్ళ మీద చెయ్యేసుకుని పడుకుంది.

డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని పేపర్ని చేత్తో పట్టుకుని ఆలోచిస్తూంది ప్రేమ. చుట్టూ ఆవరించిన చీకటి మరీ భయంకరంగా వుంది. ఏవో పరుగులు, అరుపులు చప్పుళ్ళు రాబోయే ప్రళయానికి సంకేతాల్లా గుండెల్ని దడదడలాడిస్తున్నాయి. ఏదో విధ్వంసం జరగబోతూం దని తెలుస్తూంది. పనివాళ్ళంతా వెళ్ళిపోవడంతో లంకంత యింట్లో ముగ్గురు ఆడవాళ్ళు ఏం జరగ బోతూందోననే భీతితో ప్రాణాలరచేతిలో పట్టుకుని కూర్చున్నారు.

"వీళ్ళింకా యింటికి రాలేదు. ఏం జరుగుతూందో ఏమిటో!" తలుపు దగ్గరగా వేసి వస్తూ అంది సావిత్రి.

ఏం జరుగుతుంది?! దొమ్మీ, దోపిడీ, మాన భంగాలు, రక్తపాతం... సామాన్యంగా కుల సంఘర్ష ణలు, వర్గ సంఘర్షణల్లో చోటు చేసుకునేవివే. జరిగిం దంతా జరిగిపోయాక వస్తారు. పోలీసులు, రాజకీయ నాయకులు, కుహనా సంఘసేవకులు. అరెస్టులు, పరా




మర్శలు, కల్లబొల్లి కన్నీళ్ళు, కమిషన్‌లు, విచారణలు, రాస్తారోకో, రైల్‌రోకో ఉద్యమాలు, తమ వ్రేలితో తమకన్నే పొడుచుకుంటున్నామని గుర్తించకుండా బస్సుల్ని తగలబెట్టడం, పోలీసు కాల్పులు, అమాయ కులు మరణించడం... విని విని, పేపర్లలో చదివి, చదివి 'అయ్యో!' అని ప్రతిస్పందించడం కూడా మరిచి పోయేంతగా అలవాటయి పోయాయి. వీటన్నిటినీ చూస్తూంటే మనిషి జీవితంలో ప్రతి వస్తూవు ఖరీదయిపోయింది, కాని మనిషి జీవితమే కారు చౌకయి పోయిందనిపిస్తూంది... ఆలోచిస్తున్న ప్రేమకు ఇందిరా గాంధి హత్య, తరువాత ఢిల్లీలో జరిగిన హత్యాకాండ, మొన్న మొన్న అట్లాంటిక్‌లో కనిష్క కూల్చివేయబడి నాక తన భర్త అన్నమాటలు గుర్తొచ్చాయి. "మేము గంటలు, రోజులు మృత్యువుతో పోరాడి అతికష్టం మీద ఒక ప్రాణాన్ని నిలవగలుగుతాము. కాని నిమిషాల్లో పదులు, వందలు, వేల మందిని చంపిపారేస్తున్నారు వీళ్ళు'... సావిత్రి మాటల్లో ఉలిక్కిపడింది ప్రేమ "ఊరికేదో శని దాపురించింది. ఇదివరకెప్పుడైనా ఎరుగు దుమా ఇంత ఘోర కలి! ఏడుకొండలవాడా! వెంకట రమణా! ఏం చెయ్యదల్చుకున్నావో స్వామీ! రక్షించు తండ్రీ!" ప్రేమకెదురుగా సోఫాలో కూర్చుని రెండు చేతుల్తో తలపట్టుకుని, దేవుడిని తలచుకుంటూ తనలో తనే మాట్లాడుకుంటూ ఆందోళనను అణచుకోవడానికి ప్రయత్నిస్తూంది సావిత్రి.

యింత ఘోరకలి యింతకు ముందు లేదా?... ఎందుకు లేదు? సమస్త మానవజాతి చరిత్ర రక్తసిక్తమే! 'శ్రీ శ్రీ' అన్నట్లుగా -

'నరజాతి చరిత్ర సమస్తం
రణ రక్త ప్రవాహ సిక్తం"

"నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం"

...ఎప్పుడూ వుంది మనిషిని మనిషి హింసించి, చంపి, రక్తపు టేర్లు ప్రవహింప జేసి ఆనందించడం? మనిషిని మరో మనిషి, దేశాన్ని మరో దేశం దోచుకు తినడం... ఇప్పుడు మాత్రం ప్రపంచమంతా రక్త ప్రవాహాల్తో తడిసి పోవడం లేదూ? ఇరాన్, ఇరాక్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, పంజాబ్... యిలా ఎన్నెన్నో ప్రదేశాలు రక్తంతో స్నానం చెయ్యడంలేదూ? దీనికంటే మహాఘోరం ప్రపంచం మొత్తాన్ని పదిసార్లు నామ రూపాలు లేకుండా తుడిచి పెట్టేయగల అణ్వాయుధ అగ్నిగుండం మీద సర్వమానవాళినీ కూర్చోబెట్టడం లేదూ ఈ అగ్రరాజ్యాలు... నరజాతి చరిత్ర క్రొత్త మలుపుకు తిరగనే తిరగదా? రక్తంతో వ్రాయబడిన చరిత్ర పుటల్ని గతంలోకి తిప్పేసి మానవత్వం, స్నేహం, ప్రేమలతో నూతన చరిత్రను వ్రాయడం జరగనే జరగదా?! ... వాస్తవంలో అసంభవాలైన తన ఆశల్ని, ఊహల్ని విదల్చుకోవడానికి ప్రేమ ప్రయ త్నిస్తూ వుండగానే మంటలతో ఆకాశం ఎర్ర బడింది. గప్పున పొగ వాసన, ఏడ్పులు, గగ్గోళ్ళు, అరుపులు, భయవిహ్వలులై ఏం అనర్థం జరుగుతుందోనని తలుపులు గెడవేసుకుంటానికి వెళ్తూండగానే భళ్ళున తలుపు తోసుకుని రఘు ఒంటినిండా రక్తం ధారలు కారుతూండగా లోపలికి పరుగెత్తుకు వచ్చాడు. అతన్ని తరుముకుంటూ కోపంతో, కసితో, ఉద్రేకంతో పది మంది వచ్చారు. గదిలోకి పరుగెత్తబోయిన రఘును బయటికి లాగి సింహద్వారం దగ్గర పడేసి అతని గుండెల్లో దించడానికి ఒకతను కసిగా చేత్తో ఒడిసి పట్టు రిట్టుకుని కత్తిని పైకెత్తాడు.

సావిత్రి స్పృహ తప్పి కిందపడిపోయింది. కెవ్వున కేకేసి బల్లిలా గోడకు అంటుకుపోయింది ఇందిర... హత్య! తన కళ్ళముందు ఒక నిండు ప్రాణం పోబో తుంది. 'నో' అలా కాకూడదు...తనలా కానివ్వదు. పాలిపోయి నుంచున్న ప్రేమలో చైతన్యం వస్తూంది. "ఆగండి. వాడిని చంపకండి. ప్లీజ్! ఆగండి. "పూనకం పూనిన దానిలా అరుస్తూ రివ్వున పరుగెత్తుకొచ్చి రఘుకు అడ్డుపడిన ప్రేమకు కత్తిపోటు తగిలింది.

*